నేడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆకివీడు రాక
30 పడకల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఆకివీడు రానున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించనున్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన దాట్ల విశ్వనాథరాజు, పద్మ సుందరి దాతృత్వంతో ఏర్పాటు చేసిన నాలుగు పడకల డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తారు. ఒకేసారి నలుగురికి డయాలసిస్ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యులు నిల్.. రోగులు ఫుల్..!

ఏలూరు సర్వజన ఆసుపత్రి

- ఏలూరు సర్వజన ఆసుపత్రి వైద్యుల కష్టాలు వర్ణనాతీతం
- 97 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 37 మందితోనే వైద్యం
- ప్రతిరోజూ వెయ్యి మందికిపైగా ఓపి
- 500 మంది రోగులకు ఇన్‌పేషెంట్ సేవలు ఎలా?
- పని భారంతో తల్లడిల్లుతున్న వైద్యులు
- కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి పలు విభాగాలకు డాక్టర్లు నిల్
- మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ పట్టించుకోరా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని వైద్యులతో ప్రభుత్వం బంతాట ఆడుతోంది. సరిపడా వైద్యులను నియమించకుండా ఉన్న వైద్యులపై తీవ్ర పనిభారం మోపడంతో వారు పని చేయలేని పరిస్థితి కన్పిస్తోంది. సామాన్య ప్రజానీకానికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఆలోచన పాలకులకు ఏమాత్రం లేకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లా ఆసుపత్రిని ప్రభుత్వం మెడికల్ కాలేజ్ (బోధనా ఆసుపత్రి) అనుబంధ ఆసుపత్రిగా మార్పు చేసి మూడేళ్లు గడిచిపోతుంది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పరిస్థితి తయారైంది. సర్వజన ఆసుపత్రిగా మార్పు చేసిన తర్వాత కనీస వసతులు కూడా కల్పించకుండా పాలకులు గాలికొదిలేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ వెయ్యి మంది రోగులు ఓపి (అవుట్ పేషెంట్), 500 మంది రోగులు ఇన్‌పేషెంట్ సేవలు పొందుతారు. వీరందరికీ సేవలందించేందుకు నిబంధనల ప్రకారం సర్వజన ఆసుపత్రికి 97 మంది వైద్యులను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం అక్కడ పని చేస్తున్న వైద్యులు మాత్రం కేవలం 32 మంది మాత్రమే. 65 వైద్యుల పోస్టులను ఖాళీగా వదిలేశారు. ఉన్న కొద్దిమంది వైద్యులు పూర్తిస్థాయిలో ఏవిధంగా వైద్యసేవలు అందించగలరో ప్రభుత్వమే చెప్పాలి. దీంతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని వైద్యులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడైనా చిన్న తప్పు జరిగితే అధికారులు ముందు, వెనుకా ఆలోచించకుండా చర్యలు తీసుకుంటుండటంతో పరిస్థితి సైతం వైద్యులను మానసికంగా కుంగదీస్తోంది. అత్యంత ముఖ్యమైన చెస్ట్, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, అంకాలజీ వంటి పలు విభాగాలకు సంబంధించి ఒక్క డాక్టర్ కూడా లేని పరిస్థితి ఉంది. జనరల్ మెడిసిన్‌కు సంబంధించి పది మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఐదుగురే ఉన్నారు. పీడియాట్రిక్స్‌లో ఆరుగురు వైద్యులకుగాను ముగ్గురే సేవలందిస్తున్నారు. డెర్మటాలజీలో ముగ్గురికి ఇద్దరే ఉన్నారు. ప్రతి విభాగంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సరిపడా వైద్యులను నియమించకుండా వైద్యసేవలు ప్రజలకు ఏవిధంగా అందుతాయో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. సరిపడా డాక్టర్లను నియమించకుండా వైద్యవిధాన పరిషత్ కింద పని చేసే సీనియర్ డాక్టర్లను సైతం బదిలీ చేసిన పరిస్థితి ఉంది. సరిపడా వైద్యులను నియమించకపోవడంతోపాటు, ప్రభుత్వ ఆధ్వర్యంలో 24 గంటలు పని చేసే సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి. దీంతో ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక జనం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి తీసుకొచ్చారు.

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ పట్టించుకోరా..?

బోధన ఆసుపత్రిగా ఉన్న ఏలూరు సర్వజన ఆసుపత్రికి సంబంధించి పూర్తి అధికారాలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌కు ఉంటాయి. వైద్యులకు సంబంధించి పూర్తి అధికారాలు ప్రిన్సిపల్‌కే ఉంటాయి. నర్సులు, ఆసుపత్రిలో పనిచేసే ఇతర సిబ్బందికి సంబంధించి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో సాగుతాయి. మెడికల్ కాలేజీలో 30 మంది వైద్యులు అక్కడ పాఠాలు బోధిస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో సేవలందించేందుకు అక్కడి వైద్యులను సైతం ఉపయోగించుకునే అవకాశం ఉంది. అయితే ఆ పని జరగడం లేదు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌తోపాటు ఆసుపత్రిలో సమస్యలు పట్టవా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిగి మెడికల్ కాలేజ్‌లో ఉన్న వైద్యులను ఆసుపత్రికి కేటాయిస్తే రోగులకు మేలు జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా ఏలూరు మెడికల్ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. 2023 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. 15 శాతం ఆలిండియా కోటా పోను ఇంకా 127 సీట్లు వరకూ ఉంటాయి. వీటిలో 50 శాతం ఉచితంగా, మరో 50 శాతం సీట్లను, బి కేటగిరిలో రూ.12 లక్షలు, సి కేటగిరిలో రూ.20 లక్షల ఫీజుతో కేటాయిస్తున్నారు. దీంతో గతేడాది విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజు దాదాపు రూ.11 కోట్లకుపైగా ఉంది. నిబంధనల ప్రకారం ఈ సొమ్ము మెడికల్ కాలేజ్ అనుబంధ ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులను కూడా ప్రభుత్వం మింగేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు పూర్తయ్యాయి. మరో రూ.11 కోట్లకుపైగా ఫీజుల సొమ్ము వస్తోంది. ఈ నిధులను కూడా ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేస్తారో, ప్రభుత్వం తీసేసుకుంటుందో వేచిచూడాలి. ఈ నిధులను ఇక్కడ ఉపయోగించేలా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రభుత్వంతో మాట్లాడి సాధించాల్సి ఉంది.

అత్యవసర విభాగం డాక్టర్ల నియామకంలో డిఎంహెచ్‌ఓ శ్రద్ధ పెట్టరా?

సర్వజన అత్యవసర విభాగం (క్యాజువాలిటీ) అత్యంత ముఖ్యమైంది. ఇక్కడ మూడు షిఫ్టులవారీగా వైద్యులు 24 గంటలూ వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఇక్కడ ఆరుగురు డాక్టర్లకుగాను ఇద్దరే పని చేస్తున్నారు. ఏ విధంగా సేవలందిస్తారో పాలకులు చెబితే బాగుంటుంది. అత్యవసర విభాగంలో పని చేసే డాక్టర్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగం నియమించాల్సి ఉంటుంది. సమస్యలపై ఆ విభాగం అధికారి డిఎంహెచ్‌ఓ బాధ్యత తీసుకోవాల్సి ఉంది. అత్యవసర విభాగంలో డాక్టర్ల నియామకంలోనూ తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. సమస్యలు పరిష్కరించకుండా, సరిపడా వైద్యులు లేకుండా ప్రజలకు ఏవిధంగా వైద్యసేవలు అందుతాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంది.

యలమంచిలిలో సంక్రాంతి సంబరాల పేర కోడిపందేల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు

బరులు సిద్ధం..!
హెచ్చరికలను పట్టించుకోని నిర్వాహకులు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో ఏర్పాటు చేసిన బరి

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలను నివారిస్తామని అధికారులు గ్రామాల్లో సమావేశాలు, అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికి పందెం రాయుళ్లు మాత్రం ఏటా మాదిరిగానే గణపవరంలో బరులు సిద్ధం చేస్తున్నారు. అయితే ఈసారి అధికార పక్షమైన టిడిపి నేతలు గణపవరం శివారున బరిని సిద్ధం చేస్తుండగా, జనసేన నేతలు ఇందిరమ్మ కాలనీలో బరిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఈ సారి రసవత్తరంగా పందేలు జరుగుతాయని స్థానికులు అంటున్నారు. పందాలు గణపవరంలో వేయడానికి అవకాశం లేకపోతే తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు పందాలరాయుళ్లు పావులు కదుపుతున్నారు. గతేడాది కోడిపందేల బరికి కోటి రూపాయలు వసూలు చేశారు. ఈ సారి రెండు పార్టీల నేతలు కూడా బరులు ఏర్పాటుకు ఎక్కువ మొత్తంలో సొమ్ములు రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గంలో కోడిపందేలకు అప్పుడే ఏర్పాట్లు పూర్తయినట్లు సమాచారం. గతంలో నిర్వహించిన చోటే కోడిపందేలు, జూదం బరులు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా అధికార పార్టీకి ఎక్కువ బరులను వదిలినట్లు తెలుస్తోంది. గతంలో పాలకొల్లులో మూడు బరులు భారీ స్థాయిలో నిర్మించేవారు. అయితే ఈ బరుల వల్ల నిర్వాహకులు ఆశించినంత లాభాలు చూడకపోవడంతో ముగ్గురు కలిసి ఒకే బరి నిర్వహించేలా ఒప్పందం కుదిరినట్లు సమాచారం. గతంలో యలమంచిలి మండలం కలగంపూడి గ్రామానికి వెళ్లే దారిలో భారీ పందెం నిర్వహించేవారు. అయితే ఈసారి జాతీయ రహదారి పక్కనే జూదం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ సారి పోలీసు అధికారులు కూడా అంతంతమాత్రంగానే హెచ్చరికలు జారీ చేశారు.

నేటి నుంచి సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలు
మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ రాష్ట్రస్థాయి సౌత్ జోన్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో వాలీబాల్ పోటీల ఏర్పాట్లు గురించి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఫ్లడ్ లైట్ల వెలుగులో టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న సంక్రాంతి సంబరాలతో పాటు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, జూదాలు జరుగుతున్నాయని, వీటి జోలికి యువత వెళ్లకుండా ఆపేందుకు గత 11 సంవత్సరాల నుంచి ధర్మారావు ఫౌండేషన్ తరపున వాలీబాల్ పోటీలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సమేతంగా సంక్రాంతి సంబరాలు చూసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఎస్‌సి కులగణన
తహశీల్దార్ కార్యాలయం వద్ద దళిత నేతల నిరసన

ప్రజాశక్తి - ఆచంట


వినతి అందజేస్తున్న నేతలు

ఎస్‌సి సామాజికి తరగతిని మార్చే కుట్ర జరుగుతోందని, ఎస్‌సి కులగణన అంతా తప్పుల తడకగా మారిందని దళిత నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆచంట పెదపేట, చినపేటకు గ్రామాలకు చెందిన ఎస్‌సి మాల సామాజిక తరగతికి చెందిన నేతలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు దళిత నేతలు మాట్లాడుతూ 'ఎస్‌సి కులగణన పేరుతో ఆర్యన్ మాల, ఆర్యన్ మాల క్రిస్టియన్, ఆది ఆంధ్ర, ఆది ఆంధ్ర క్రిస్టియన్, ఎస్‌సి మాల క్రిస్టియన్‌గా తప్పుడు సమాచారాన్ని ముద్రిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల నుంచి ఎస్‌సి మాలలకు చెందిన పర్మినెంట్ క్యాస్ట్ సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. ఇటీవలే జరిపిన కులగణన ఆచంట పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించిన జాబితాపై సమగ్ర సర్వే చేయించి తప్పులు సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావు మాట్లాడుతూ కులగణన సర్వేలో కొన్ని తప్పులు వచ్చాయని, వీటిని సరిచేసి గ్రామ సభలు నిర్వహించి అనంతరం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు కోట వెంకటేశ్వరరావు, పారుపల్లి సుందరపాల్, మట్టా చంటి, బీర మధు, ఇజ్రాయిల్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం : కులగణనలో మాల, మాదిగలకు ఆది ఆంధ్ర అని నమోదు చేయడం సరికాదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు అన్నారు. ఈ మేరకు కెవిపిఎస్ జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అన్ని సచివాలయాల్లో ప్రదర్శనకు పెట్టిన ఎస్‌సి, ఎస్‌టిల కులగణనలో అనేక తప్పులు ఉన్నాయని దీనిపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా అధికారులను కెవిపిఎస్ కోరుతోందన్నారు. పాలకోడేరు మండలం మోగల్లు సచివాలయంలో పెట్టిన లిస్టులో ఎక్కువ మంది ఎస్‌సిలకు ఆది ఆంధ్రా అని వచ్చిందని, మార్చమని అడిగితే అలా కుదరదని లిస్టులో ఆది ఆంధ్రా అని వచ్చినా కుల ధ్రువీకరణ పత్రం మాత్రం మాదిగ, మాల అని ఇస్తామని, రెండూ ఒకటే అని వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. సవరణలకు వెళ్లిన ఎస్‌సిలకు సరైన సమాధానం కూడా చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం జిల్లా కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ అధికారులు క్షేత్రస్థాయిలో కులగణనపై సమీక్షించాలన్నారు. జిల్లా స్థాయిలో ఒకరోజు కులగణనపై గ్రీవెన్స్ జరపాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం మార్పులు చేయాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సమ్మెకాలపు హామీలు అమలు చేయాలి

తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - తణుకు

గత సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు, జిఒలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన, ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ విల్సన్ జైకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ నాయకులు ఎన్.ఆదినారాయణబాబు, ఉండ్రాజవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. రోజురోజుకూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంట్ ఛార్జీలు భారీగా పెరుగుతున్నా తమ వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె కాలంలో తమకు మద్దతిచ్చిన టిడిపి, జనసేన నేడు అధికారంలో ఉన్నా సమస్యలు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో సమరశీల పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా శ్రామిక కన్వీనర్ అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గార రంగారావు, గెల్ల విజయకుమార్, పి.జ్యోతిబాబు, డి.వెంకటేశ్వరరావు, అర్జి కృష్ణబాబు, కుసుమ, గన్నిరాజు, శ్రీదేవి, పుష్పరాణి, బ్రహ్మాజీ, మందులయ్య, అరుణాదేవి, సుధాకర్, అయ్యప్ప, మణికంఠ, శిరీష పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : మున్సిపల్ కార్మికులకు సమ్మెకాల ఒప్పందాలను అమలు చేయాలని, పనికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు నెల రూ.26,000 జీతం ఇవ్వాలని సిఐటియు భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం మున్సిపల్ ఆఫీస్ వద్ద శుక్రవారం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉంచడంలో కీలకంగా పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నేలపు రాజు, బంగారు వరలక్ష్మి, బంగారు ఏసేబు, ధనాలు చినపెద్దిరాజు నీలాపు నాగేశ్వరరావు, నీలాపు అప్పన్న, మాడుగుల రత్నకుమారి, మాడుగుల పద్మ, పల్లా రాజు నాగమణి పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం : మున్సిపల్ కార్మికుల సమ్మెకాలపు హామీలు జిఒగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 17 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ వయసు పెంచాలని, మరణించిన వారికి మట్టి ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ డిమాండ్లన్నీ పరిష్కరించి జిఒలు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకటరావు, తాడికొండ జయరాం కృష్ణ, కొడమంచిలి బాబు, ధనరాజు పాల్గొన్నారు.

భీమవరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు, నేతలు

నరసాపురం : మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన ఒప్పందాలను, జిఒల రూపంలో జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక నాయకులు నల్లి థామస్, చిక్కాల వాసు, కమిటీ సభ్యులు కున వెంకటరమేష్, జివివి.సత్యనారాయణ, తోట పార్థసారథి, షేక్ అమీనా, టి.కళ్యాణి, డి.రాజ్యలక్ష్మి, పడవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురంలో నిరసన

సమాజంలో రుగ్మతలు పోవాలంటే విద్యే మార్గం
ఎంపీ పురంధేశ్వరి

ప్రజాశక్తి - నరసాపురం

సమాజంలో రుగ్మతలు పోవాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. పట్టణంలోని వైఎన్ కళాశాల ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పురంధేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను ప్రారంభించి, సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ మంచి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన కళాశాల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. మంచి సంకల్పంతో యర్రమిల్లి నారాయణమూర్తి ఈ కళాశాలను స్థాపించారని కొనియాడారు. కళాశాల అభివృద్ధిలో కార్యదర్శి చినమిల్లి సత్యనారాయణ చేసిన కృషి అడుగడుగునా కనబడుతోందన్నారు. విద్య అంటే పాఠ్యపుస్తకాలు, తరగతి గదులు రాంకులు మాత్రమే కాదన్నారు. చదువు అంటే సర్టిఫికెట్స్, మెడల్స్, ర్యాంకులకు పరిమితం కాకుండా సంస్కృతీ సంప్రదాయాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం యజమాన్యం పురంధేశ్వరిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కళాశాల ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో చినమిల్లి సత్యనారాయణ రావు కృషిని ఏ భవనాన్ని, చెట్టును అడిగినా చెబుతుందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఉపాధ్యక్షులు పొన్నపల్లి శ్రీరామారావు మాట్లాడుతూ 1983లో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గా భాధ్యతలు స్వీకరించిన తరువాత కళాశాల రూపు రేఖలు మారాయన్నారు. చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడారు. యర్రమిల్లి నారాయణ మూర్తి కృషితో ఈ కళాశాల ప్రాంభమైందని, కళాశాలకు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడానికి అప్పటి లా మినిష్టర్ గ్రంధి వెంకటరెడ్డి నాయుడు ఎంతో కృషి చేశారని తెలిపారు. వైఎన్ కళాశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన ఎన్నో సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ఎంతో సంస్కారం నేర్పిందని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మైనారిటీ వ్యవహారాలు) ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని , భవిష్యత్‌ను ఈ కళాశాల అందించినదన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. మాజీ శాసన సభ్యులు కొత్తపల్లి జానకిరామ్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఎక్స్ అఫిషియో ఛైర్మన్, ఆర్‌డిఒ దాసి రాజు, కళాశాల కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు, మాజీ ఉపాధ్యక్షులు జివికె.రామారావు, ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, పీజీ డైరెక్టర్ ఎన్.చింతారావు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న పురంధేశ్వరి

తాళ్లకోడు కాలనీని ఆకివీడులో కలపాలి

ప్రజాశక్తి - ఆకివీడు

నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

తాళ్లకోడు కాలనీని ఆకివీడు నగర పంచాయతీలో కలపాలని సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు తాళ్లకోడు కాలనీలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు సరఫరా చేయాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, పట్టణ కమిటీ సభ్యులు పెంకి అప్పారావు, బివి వర్మ మాట్లాడుతూ 3,000 మందికిపైగా నివాసం ఉంటున్న తాళ్లకోడు కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సత్వరం ఎంఎల్ఎ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న వేసవిలోపు కాలనీవాసులకు తాగునీరు అందుబాటులోకి తేవాలని, ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. తాళ్లకోడు కాలనీలో 90 శాతానికి పైగా ఆకివీడు నగర పంచాయతీకి చెందిన ప్రజలేనని గుర్తు చేశారు. ఈ కాలనీని ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కె.సరోజినీ, ఎ.దేవి, ఎన్.లక్ష్మి, లక్ష్మీదుర్గ, బి.నాగు, బి.ఏసు, శామ్యూల్, రత్నమాల, ఎం.కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెంలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - తణుకు

రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్‌లో సంక్రాంతి సంబరాలు వీనుల విందుగా జరిగినట్లు సంస్థ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాఠశాల ప్రాంగణంలో మామిడి తోరణాలు కట్టి, పుష్పాలతో అలంకరించారు. చిన్నారులు అందరూ సాంప్రదాయ వస్త్రాలు ధరించి ముగ్గులలో గొబ్బెమ్మలు అలంకరించి, గొబ్బిళ్ళో గొబ్బిళ్ల అంటూ పలు కీర్తనలు ఆలపించారు. వివిధ వేషధారణలతో విద్యార్థులు చూపరులను అలరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎన్.సుధాకరవర్మ, ప్రైమరీ ప్రిన్సిపల్ టి.సంధ్యా, డి.పద్మజ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి విద్యాసంస్థల్లో ముగ్గుల పోటీలను కళాశాల ప్రాంగణంలో ఈనెల 8వ తేదీన నిర్వహించారని, ఈపోటీల్లో విజేతలకు మానవత సంస్థ వారు డిగ్రీ కళాశాల నుంచి 4 బహుమతులు, జూనియర్ కళాశాల నుంచి 3 బహుమతులు, విజిఎస్ స్కూల్ నుంచి 3 బహుమతులు ప్రధానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక శ్రీ వాసవి జిఎంఆర్ విద్యాసంస్థలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాంప్రదాయక దుస్తులు ధరించి, గొబ్బెమ్మలు, భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలలో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వివిఎస్.లక్ష్మీనారాయన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంస్కృతి, సాంప్రదాయాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : పిప్పర అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిప్పర సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు. కేంద్రంలో భోగిమంటలు ఏర్పాటు చేశారు. సంక్రాంతి ముగ్గులతో కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ సంబరాల్లో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలందరూ విజేతలేనని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సెంటర్లో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో మహిళలకు జరిగిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోటీలో సుమారు వందమందికిపైగా మహిళలు పాల్గొనగా వరుసగా పదిమందిని విజేతలుగా ప్రకటించారు. వీరితోపాటు పోటీలో పాల్గొన్న మహిళలందరికీ చీర, గిఫ్ట వంటివి అందజేశారు. ఎంపిక చేసిన పదిమంది విజేతలు ఈనెల 13న నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హులని నిర్వాహకులు ప్రకటించారు. సర్పంచి చొప్పల రజిని, యర్రంశెట్టి పద్మారావు, బోనం చినబాబు పాల్గొన్నారు.

నరసాపురం : సంసిద్ధ్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విద్యార్థులు తయారుచేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి నాయకర్ మాట్లాడుతూ పండుగల విశిష్టత, సంస్కృతి సాంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంసిద్ స్కూల్ యాజమాన్యం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫుడ్ ఫెస్టివల్ కల్చర్ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల వారిలో పోటీతత్వం నెలకుంటుందన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ మెట్ల సురేష్ పాల్గొన్నారు.



నరసాపురం : సంబరాల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎ నాయకర్

కొనసాగిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

సంక్రాంతి యువజనోత్సవాలలో భాగంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు మండలాల స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. ఈ పోటీలలో మొత్తం 20 టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో పది టీములకు పోటీ పూర్తికాగా మూడవరోజు ఆకివీడు-చెరుకువాడ, ఉండి-ఆకివీడు, దుంపగడప-కలింగగూడెం, ఎన్‌జి వై-ఆక్వా, దుంపగడప ఎకెపిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల-శాంతినగర్ తిరుమల మధ్య పోటీలు జరుగుతున్నాయి. మిగిలిన టీములకు శనివారం పోటీలు జరుగుతాయి. వీటిలో గెలుపొందిన వారు శని, ఆదివారాల్లో ఫైనల్లో పోటీపడతారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ తెలిపారు.

ప్రజా ప్రతినిధులు మారాలి : ధనుష్

జూద క్రీడలకు వ్యతిరేకంగా తాము రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలను నిర్వహిస్తుంటే, తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో కోడిపందేలు, పేకాట వంటి జూద క్రీడలను ప్రజాప్రతినిధులు ప్రోత్సహించడం చాలా దారుణమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనుష్ అన్నారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించి, సరైన మార్గంలో నడిపించాలన్నారు. మన నాయకులు జూద క్రీడలను ప్రోత్సహించడం వల్ల సమాజంలో మంచి కంటే కూడా చెడు ఎక్కువగా పెరిగే ప్రమాదం ఉందన్నారు. భావితరాలకు బాటలు వేయాల్సిన నాయకులే ఈ విధంగా జూదక్రీడలను ప్రోత్సహించడం వారికి నష్టం కలిగించే ప్రక్రియ అన్నారు. డివైఎఫ్ఐ నిర్వాహక కమిటీ కన్వీనర్ డోకల రవితేజ మాట్లాడుతూ సుమారుగా మూడు నియోజకవర్గాల నుంచి 20 క్రికెట్ టీమ్‌లు వచ్చాయి. ఈరోజు కైకలూరు, ఏలూరుపాడు, చెరుకుమిల్లి, ఆకివీడు, చినకాపవరం టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, ఎమ్‌డీ అలీ, కె.రమణ, బి.అప్పారావు పాల్గొన్నారు.



ఏసుబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

ఘనంగా తారకరామా కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏసుబాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రముఖ గ్రేడ్ వన్ కాంట్రాక్టర్ తారకరామా కన్‌స్ట్రక్షన్ అధినేత పళ్ల ఏసుబాబు పుట్టినరోజు వేడుకలు భీమవరంలో ఘనంగా జరిగాయి. ఏసుబాబు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వేంద్ర కాల్వ గట్టు రోడ్లో పేదలకు ప్రధానమంత్రి ఆవాస యోజన గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం వద్ద ఆయన కార్యాలయంలో పెద్ద ఎత్తున పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఆయనకు పలువురు రాజకీయ నాయకులు, మున్సిపల్ అధికారులు శుభాకాంక్షలు తెలియజేయగా ఆయన అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలో ప్రత్యేక సభా వేదికను హౌసింగ్ ఇఇ రమణ ప్రారంభించారు. ముందుగా ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని గోవులకు గోపూజ నిర్వహించారు. వడ్డీ సుబ్బారావు, సత్యనారాయణ, ఫణిబాబు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా డంపింగ్ యార్డు సర్వే

నరసాపురం: గోదావరి ఒడ్డున్న ఉన్న చెత్త ఏమేరకు ఉందన్న దానిపై శనివారం నుంచి డ్రోన్ ద్వారా సర్వే చేయించనున్నట్లు రీజనల్ డైరెక్టర్ నర్సింహారావు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని గోదావరి తీరాన ఉన్న డంపింగ్ యార్డును ఆయన సందర్శించారు. ఉన్న చెత్తపై ఆరా తీశారు. రీసైకిలింగ్ జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఎప్పటికి పూర్తి చేస్తారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మల శుద్ధి ప్లాంటును పరిశీలించి అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం 51 వేల మెట్రిక్ టన్నుల చెత్త రీసైకిలింగ్ జరుగుతుందన్నారు. ఇది కాకుండా ఇంకా 20 వేల టన్నులు ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. శనివారం డ్రోన్ సర్వే ద్వారా ఉన్న చెత్తను గుర్తించి స్వచ్ఛంద కార్పొరేషన్ల ద్వారా దాన్ని కూడా టెండర్లు పిలిచి రీసైకింగ్ వేరు చేస్తామన్నారు. నరసాపురం డంపింగ్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం చెత్త ఎక్కడ చేయాలన్న దానిపై కూడా సమాలోచన చేస్తున్నామన్నారు. త్వరలోనే ఈ సమస్య కొలిక్కి వస్తుందన్నారు. జిల్లాలో పన్ను వసూళ్లల్లో తణుకు, నరసాపురం మొదటి, రెండు స్థానాల్లో ఉన్నాయన్నారు. ప్రజలు తడి, పొడిగా సిబ్బందికి చెత్తను అందిచాలన్నారు. ఆయన వెంట కమిషనర్ అంజయ్య, డిఇ ప్రవీణ్, ఎఇ కిషోర్, నవ్యలు పాల్గొన్నారు.

లూథరన్ హైస్కూల్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం

భీమవరం టౌన్ : భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో శంకర హ్యాండ్ లూమ్స్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శుక్రవారం ప్రారంభించారు. సంక్రాంతి వేడుకల్లో ఆహ్లాదం కోసం ఎటువంటి ఎగ్జిబిషన్లు మన ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు షేక్ అలిషా మాట్లాడుతూ 40 రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, మైలబత్తుల ఐజాక్ బాబు పాల్గొన్నారు.

కరెంటు బిల్లులు భోగిమంటల్లో దగ్ధం చేయాలి

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - వీరవాసరం

వివిధ రకాల కరెంటు ఛార్జీలతో ప్రజలపై భారాలు వేయడం సరికాదని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహామూర్తి విమర్శించారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం మండల నాయకులు కేత జ్యోతిబసు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచమని, రైతులకు స్మార్ట్ మీటర్లు పెట్టమని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో ప్రజలపై రూ.15,485 కోట్లు ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల ముక్కు పిండి వసూలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బాధే బాదుడు అంటూ ఆందోళన చేసిన వారు అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీకి వేల కోట్ల లాభాలకు గ్యారెంటీ ఇవ్వడమే కాకుండా వందల కోట్లు విలువైన విశాఖలోని విద్యుత్ శాఖ భవనాన్ని కట్టబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలపై వేల కోట్ల కరెంట్ ఛార్జీలు మరలా పెంచేందుకు సిద్ధపడుతున్నారని అది సరికాదు అన్నారు. ప్రజలపై వేల కోట్ల కరెంట్ ఛార్జీలు పెంచే ముందు 2000లో హైదరాబాద్ బషీర్ బాగ్‌లో జరిగిన సంఘటన టిడిపి గుర్తుచేసుకోవాలని అన్నారు. దొడ్డి దారిన ప్రజలపై వేలకోట్ల భారాలు వేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రభుత్వం మారి ఏడు నెలలు కావస్తున్నా గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నారని విమర్శించారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించద్దని నరసింహామూర్తి డిమాండ్ చేశారు. ఈనెల 13న భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాలకతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ బొర్ర అలమహారాజు, మండల నాయకులు పోతుల మృత్యుంజయ, తాళ్లూరి రాము, అయినపూడి బాబురావు, రెడ్డి రామారావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలి

సిపిఎం నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - పెంటపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని విశాఖ ఉక్కు పరిశ్రమని కాపాడాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని శుక్రవారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరుపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమని కాపాడతానని హామీ ఇచ్చిందని, కానీ నిన్న ఎనిమిదో తారీకున దేశ ప్రధానమంత్రి మోడీ విశాఖ పర్యటనకు వచ్చారు. ప్రజలు, కార్మికులు ఎంతో ఆసక్తిగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేయనని హామీ ఇస్తారని ఆశించారు. కాని మోడీ, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి విశాఖ ఉక్కు పరిశ్రమ మీద ఎటువంటి హామీ ఇవ్వలేదని వారు తెలిపారు. కార్మికులు జీతాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిశ్రమకి ముడి చమురు, గనుల కేటాయింపు లేదని, ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించేందుకు ఉత్పత్తి నష్టాలబాటనే చూపించేటట్టు ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి కానీ ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, గనులు కేటాయించాలని, ప్రయివేటుపరం చేయకుండా ఆపాలని చూడటం లేదన్నారు. ఈ పరిశ్రమకు నిధులు కేటాయించకుండా కొత్తగా అనకాపల్లిలో మరో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని, పరిశ్రమలు ఉత్పత్తి అయిన ఇనుము ఈ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలకు కూడా నిర్మాణం చేసుకున్న వారికి ఉక్కు చాలా తక్కువ రేటుకి అందుబాటులో ఉండేది, అందుచేత తక్షణమే నిధుల గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గత కరోనా సమయంలో ప్రజలకి ఆక్సిజన్ అందించడంలో ఆ పరిశ్రమ ఎంతో ఉపయోగపడిందని వారు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం మూడు లక్షల కోట్ల సామర్థ్యం గల పరిశ్రమని కాపాడాలని, ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళన పోరాటాలు జరుగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా, మాకిరెడ్డి రాంబాబు, దత్తు రాము, బర్ల బాలాజీ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ కె.రాజకిషోర్ హెచ్చరించారు. శుక్రవారం మొగల్తూరు, కాళీపట్నం పడమర తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహనా ప్రదర్శన చేశారు. కోడిపందేలు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గుండాట, పేకాట, జూద కార్యక్రమాలు నిర్వహించినా, ఆడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు పడవల మేరీ సత్యనారాయణ, కవురు సావిత్రి ఆదినారాయణ, కార్యదర్శులు ముచ్చర్ల చెన్న, ఎం.సత్యనారాయణ, పంచాయతీ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

తణుకు రూరల్ : సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తణుకు మండల తహశీల్దార్ డివివిఎస్.అశోక్ వర్మ హెచ్చరించారు. కోడిపందేలు, జూద క్రీడలపై హైకోర్టు ఆదేశాల మేరకు తణుకు మండల పరిధిలో కోడిపందేల బరుల నిర్వాహకులు, కత్తులు కట్టేవారు, కోతాటలు నిర్వహించే వారిని గుర్తించి మండల పరిధిలో 77 మందిని బైండోవర్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉండి : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా పిలుపునిచ్చారు. మండలంలోని చెరుకువాడ, అర్తమూరు, మహదేవపట్నం, పాందువ్వ, కలిగొట్ల, ఎండగండి, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఆరేడు తదితర గ్రామాలలో జూద క్రీడలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబంతో ఆహ్లాదకరంగా పండుగను చేసుకోవాలని ఆయన సూచించారు. జూద క్రీడలైన కోడిపందేలు, గుండాట, పేకాట వంటి క్రీడలను హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధించడం జరిగిందని అన్నారు. ఇటువంటి జూద క్రీడలను మండలంలో ఎవరైనా ప్రోత్సహించినా, నిర్వహించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సాంస్కృతిక క్రీడలను ప్రోత్సహించాలని, యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడి పందేల బరుల వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలు

పెనుగొండ : కోడిపందేలు, పేకాట తదితర అసంఘటిత కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ ఎస్ఐ కె.గంగాధర్ హెచ్చరించారు. మండలంలో గతంలో కోడిపందేల బరుల వద్ద శుక్రవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో కుటుంబ సభ్యులు కలిసి సాంప్రదాయమైన పిండి వంటలతో సంబరాలు జరుపుకోవాలని అన్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా : ఎంఎల్‌ఎ

ఆచంట: మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపరిచి సుందరీకరణ చేస్తానని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట గ్రామ అభివృద్ధి సేకరణ వేదిక కార్యక్రమం సర్పంచి కోట సరోజిని అధ్యక్షతన శుక్రవారం రాత్రి ఆచంట కచేరి సెంటర్లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని అన్నారు. కనీసం రహదారులలో తట్ట మట్టి కూడా వేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆచంటలో సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్ డ్రెయినేజీలు దీర్ఘకాలిక సమస్యగా ఉందని, దీనిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల ఘటన అమానుషం

వైసిపి రాష్ట్ర రైతు విభాగపు అధ్యక్షులు వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం : తిరుపతి పుణ్యక్షేత్రంలో జరిగిన తొక్కిసలాట రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చిందని వైసిపి రాష్ట్ర రైతు విభాగపు అధ్యక్షులు వడ్డి రఘురాం నాయుడు ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం అమానుషమని అన్నారు. చనిపోయిన వారికి, క్షతగాత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. మరణించిన కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలన్నారు. ఇటువంటి సంఘటనలతో రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా అభాసుపాలు చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం ప్రసాదాన్ని గతంలో అభాసుపాలు చేసిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. చనిపోయిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఇవ్వాలని, క్షతగాత్రులు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నెగ్గిపూడి పంచాయతీ సమావేశం వాయిదా

పెనుమంట్ర : మండలంలోని నెగ్గిపూడి గ్రామ పంచాయతీలో శుక్రవారం జరగవలసిన పాలకవర్గ సమావేశం వాయిదా పడింది. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు సెలవుపై ఉండడంతో ఇన్‌చార్జి కార్యదర్శిగా మార్టేరు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ బాధ్యత స్వీకరించి, గత 3 నెలలుగా నిర్వహించిన ఇంటి పన్నుల వసూళ్ల వివరాలు, తదితర పనులపై రికార్డులు అందుబాటులో లేకపోవడం, ముఖ్యంగా గత సంవత్సరం అక్టోబర్ 28న జరిగిన పంచాయతీ సాధారణ సమావేశం తాలుకు అజెండా వివరాలు, తీర్మానాలు ముఖ్యమైన తీర్మాన పుస్తకంలో ఎటువంటి నమోదు చేయకుండా అసంపూర్ణంగా వదిలివేయడంతో సాధారణ సమావేశ పాలకవర్గ సభ్యుల అభ్యంతరంతో వాయిదా వేయడం జరిగిందని సర్పంచి, కొందరు వార్డ్ సభ్యులు తెలిపారు. పంచాయతీని నిర్వహిస్తున్న ఏ కార్యక్రమమైన సరే పాలకవర్గ సభ్యులకు పూర్తిస్థాయి సమాచారం అందించకుండా, అనధికార నియామకం చేస్తున్నారే కాకుండా, నెలరోజుల పాటు విధులకు హాజరుకాని వేయడంలో గతంలో ఆందోళన వ్యక్తం చేయడం జరిగిందని వారు అన్నారు. నేటికీ రికార్డులు పూర్తిస్థాయిలో అందించకుండా, అందుబాటులో లేకపోవడంతో కార్యదర్శి వెంకటేశ్వర్లు సాధారణ సమావేశం ఏర్పాటు చేయడంతో సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ, జరిగిన విషయాలపై అధికారులకు నివేదించిన కోరుతూ సమావేశం వాయిదా కోరారు. దీంతో సమావేశం వాయిదపడింది. అనంతరం కార్యాలయ సిబ్బందికి, పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు, నూతన వస్త్రాలు, సబ్బులు, నిత్యావసర వస్తువులు సర్పంచి ఎం.ధనలక్ష్మి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాలకవర్గ సభ్యులు పంపిణీ చేశారు.

శతాధిక వృద్ధురాలు సత్యవతి మృతి

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు తాడాల సత్యవతి(103) శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈమె భర్త తాడాల రామ్మూర్తి కాగా, ఇద్దరూ సిపిఎం సానుభూతిపరులు కావడం విశేషం. సత్యవతికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, మనవళ్లు, మనుమరాళ్లు, ముని మనుమళ్లు ఉన్నారు. ఆమె పెద్ద కుమారుడు తాడాల సత్యనారాయణ మూర్తి ఎక్స్ మిల్ట్రీ కెప్టెన్‌గా 1971 కార్గిల్ వార్ పనిచేశారు. ఆయన ఆర్మీలో 30 సంవత్సరాలుగా దేశానికి సేవలు అందించారు. రెండో కుమారుడు తాడాల రామకృష్ణ డిప్యూటీ కమిషనర్ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ డిపార్ట్మెంట్ పనిచేస్తున్నారు. పెద్ద కుమార్తె కటికి రెడ్డి సూర్యవతి పొలమూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పని చేశారు. రెండో అమ్మాయి విద్యావతి, మూడో అమ్మాయి యర్రంశెట్టి గిరిజావతి. శతాధిక సంవత్సరాల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఉండే సత్యవతి మృతి చెందడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తూ, సంతాపం తెలిపారు.

100 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిగూడెం : స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద శుక్రవారం కంచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంసి మాజీ డైరెక్టర్ జగన్నాధరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనంతరం వంద మందికి కంటి పరీక్షలు చేశారు. జనసేన 12వ వార్డు ఇన్‌ఛార్జి దస్తగిరి, ఎఎంసి మాజీ డైరెక్టర్ కోడేళ్ళ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల రాజా పాల్గొన్నారు.

మంత్రి అనగానిని కలిసిన భూపతిరాజు రవీంద్ర రాజు

పెనుమంట్ర : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆయన్ని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినట్లు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీ నారాయణ, కార్యవర్గ సభ్యులు ఏజర్ల ప్రభాకర్, ఎన్‌టిఆర్ జిల్లా డివిజన్ అధ్యక్షులు ఎమ్‌డి సయ్యద్ బాజీ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.వెంకటరత్నం పాల్గొన్నారు.

అఖండ అన్న సమారాధన

ఉండి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉండి బాలాజీరావు పేటలో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో టిడిపి సీనియర్ నాయకులు తోట శ్రీరాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తోట శ్రీరాములు మాట్లాడుతూ తాను తనకున్న దానిలో సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా గత కొన్ని సంవత్సరాలుగా వర్ధంతిని పురస్కరించుకుని ఆలయాలను సందర్శించుకునే యాత్రికులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కాగిత మాతయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

400 మందిపై బైండోవర్

350 కోడి కత్తుల స్వాధీనం : డిఎస్‌పి జైసూర్య

భీమవరం టౌన్ : కోడిపందేల నియంత్రించేందుకు చర్యలు చేపట్టామని, దీనిలో భాగంగా కోడిపందేలు నిర్వహించే 400 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, 350 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం డిఎస్‌పి ఆర్‌జి.జైసూర్య తెలిపారు. శుక్రవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, కుటుంబ సభ్యులతో గడిపి పండగను చేసుకోవాలని కోరారు. కానీ కొందరు జూదాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగానే కాళ్ల మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరుపాడు, కాళ్లకూరు, సీసలి గ్రామాలకు చెందిన గనిశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి రాంబాబు, బోరా వెంకటేశ్వర్రావు వద్ద నుండి 350 కోడి కత్తులను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిఐలు నాగరాజు, కాళీ చరణ్, జగదీశ్వరరావు, కాళ్ల ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐదుగురు మహిళల అరెస్ట్

భీమవరం టౌన్ : ఆటోలో ఒంటరిగా కూతురు ఇంటికి వెళుతున్న మహిళను ఏమార్చి ఆమె వద్ద నుంచి రూ.లక్ష యాభై వేల నగదును చోరీ చేసిన ఐదుగురు మహిళలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం డిఎస్‌పి ఆర్‌జె.సూర్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరి సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల ఆరో తేదీన పిప్పర గ్రామానికి చెందిన వేగిరాజు రామలక్ష్మి భీమవరంలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు భీమవరం వచ్చి బస్టాండ్ నుంచి కుమార్తె ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కగా ఐదుగురు మహిళలు ఆటో ఎక్కి ఇద్దరు ఆమెకు చోరో వైపు కూర్చుని, మరో ముగ్గురు ఎదురుగా కూర్చుని ఆమెను మాటలతో మాయ చేసి నగదు దొంగలించారు. దీనిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు మహిళలను అదుపులకు తీసుకుని నగదు స్వాధీనం చేసినట్లు తెలిపారు. అయితే గతంలో వీరిపై పలు పోలీస్ స్టేషన్లో కేసులో ఉన్నట్లు డిఎస్‌పి వివరించారు. సమావేశంలో సిఐ కాళీ చరణ్, ఎస్ఐ ఇజ్రాయిల్, కానిస్టేబుల్, రాజు, ఎస్ఎన్.భూషణం, ముత్యాలరాజు, కె.నరేష్ అభినందించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రదేశాలలో దాడులు నిర్వహించి, మండలంలోని పర్వపేట గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు డ్యూటీపెయిడ్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మావుళ్లమ్మ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మ అమ్మవారి 62వ ఉత్సవ మహోత్సవాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమవరం డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ ఆర్.రాంబాబు, అడిషనల్ ఎస్‌పి భీమారావు, వన్ టౌన్ సిఐ నాగరాజు ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సిబందికి పలు అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సమస్యలపై సచివాలయ సిబ్బంది సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి రోజు సచివాలయ పరిధిలో ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలిదశలోనే అడ్డుకోవాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని, పనులను నేరుగా పరిశీలించిన తదుపరే బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేస్తామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనల్లో తప్పనిసరిగా ఎండ్ టు ఎండ్ రోడ్, డ్రెయిన్లు ఉండేలా చూడాలన్నారు.

వైఎస్ఆర్ విగ్రహ ధ్వంసంపై ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని గురువారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై వైసిపి శ్రేణులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న డిఎస్‌పి శ్రీవేద సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ విగ్రహానికి సమీపంలో ఉన్నటువంటి ఇంటి యజమాని నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయవలసిందిగా పోలీసులు సూచించడంతో ఆయన విగ్రహాన్ని రప్పించారు. జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాణి బాపూజీ ఆ విగ్రహాన్ని వైసిపి శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేవు నారాయణమూర్తి, తన్నీడి గిరి కుక్కల కృష్ణమోహన్, నిప్పులేటి బోసు ఉన్నారు.

కాళ్ల : క్యూ లైన్‌లో యాత్రికులు

పలుచోట్ల ముక్కోటి ఏకాదశి

ఆచంట: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొడమంచిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవంలో భాగంగా రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమంలో యాత్రికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. కరుగోరుమిల్లి, ఆచంట వేమవరం, పెనుమంచిలి, భీమలాపురం గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము రెండు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు బార్లు తీరారు. అందుకు అనుగుణంగా ఆలయ అధికారులు యాత్రికులకు సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పూల మొక్కలు ఏర్పాటు చేసి, ఆలయం శోభాయమానంగా ముస్తాబు చేశారు. చిన్నపిల్లలకు, వృద్ధులకు పాలు, ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో పాలకోడేరు సొసైటీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, ఎంపిపి పెనుమెత్స శిరీష విశ్వనాథరాజు, అడ్డాల రాము ఉన్నారు.

విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

నరసాపురం: 2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై శుక్రవారం ఏపిఇఆర్‌సి చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం ఇఇ కార్యాలయంలో ఇఇ కె.మధుకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలు మాట్లాడేందుకు ఆయన స్క్రీన్ ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారంతో ప్రజాభిప్రాయ సేకరణ ముగిసినట్లు ఇఇ మధుకుమార్ తెలిపారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/2019/డి.బి ది.09-01-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.21 (1-10) / BHI/General/2024-25/E1/E2 & టెండరు నోటీసు నెం.21(11-13) BHI/General/2024-25/E1 లోని జనరల్ ఫండ్స్ నుండి 13 పనులకు సంబంధించి రూ. 81.27 లక్షలతో ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిస్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘము, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543 వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం